క్లుప్తంగా

దొరబాబుకు నాయీ బ్రాహ్మణుల మద్దతు



వైఎస్సార్ సీపీ అభ్యర్థి దొరబాబుకు మద్దతు తెలియజేసిన నాయీ బ్రాహ్మణులు

సామర్లకోట: పట్టణ నాయీ బ్రాహ్మణులు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబుకు మద్దతు తెలియజేశారు. స్థానికునిగా, ఎమ్మెల్యే అభ్యర్థిగా దవులూరి దొరబాబు పోటీ చేయడంతో స్థానిక నాయీ బ్రాహ్మణుల సమస్యలు పరిష్కారం అయ్యే అవకాశం ఉన్నాయని, అందువల్ల ఆయనకు మద్దతు ఇస్తున్నట్లు ఆ వర్గం నాయకులు తెలిపారు. జిల్లా నాయీ బ్రాహ్మణ సంఘ గౌరవ అధ్యక్షుడు స్వయంభారపు వీరభద్రరావు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ క్యాంపు కార్యాలయంలో కలిసి తమ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు మన్యం చంద్రరావు, వైఎస్సార్ సీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ పాగా సురేష్‌కుమార్, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ వారా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్లాప్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



మెగా వైద్య శిబిరంలో చికిత్స అందిస్తున్న వైద్యులు

పెద్దాపురం: క్లాప్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పాస్టర్ జి.జాన్‌మోజెస్ దాస్ అన్నారు. స్థానిక కల్వరి మిరాకిల్ చర్చిలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా క్లాప్స్ అధ్యక్షుడు లంకా పురుషోత్తమ్‌దాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మోజెస్ దాస్ మాట్లాడుతూ దేవుని సేవా పరిచర్యతో పాటు ప్రజా సేవలందిస్తున్న క్లాప్స్ సేవలు అభినందనీయమన్నారు. క్లాప్స్ సేవలను మరింత విస్తృతం చేయాలని ఆయన సూచించారు. అనంతరం సుమారు 120 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీబీఐ కుమార్, రాజారావు, శేఖర్, విల్సన్, జేమ్స్, చందూ స్టీఫెన్, విజయలక్ష్మి ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ

గొల్లప్రోలు: తాడిపర్తి గ్రామంలో శ్రీమ్ అపర్ణా సేవా ట్రస్టు ఆధ్వర్యంలో మండలంలోని పదో తరగతి విద్యార్థులకు పాలిటెక్నిక్ ఉచిత శిక్షణ తరగతులు గురువారం సాయంత్రం నుంచి ప్రారంభమవుతాయని ఆ ట్రస్టు చైర్మన్ డాక్టర్ ఆకొండి వేంకటేశ్వర శర్మ (బాబి) మంగళవారం తెలిపారు. సుశిక్షితులైన ఉపాధ్యాయులతో శిక్షణ ఇస్తున్నామని, ఆసక్తి ఉన్న విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. 9440341579, 7013460210, 9989527884 నెంబర్లకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పిఠాపురం: కొత్తపల్లి మండలం వాకతిప్పలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందినట్టు కొత్తపల్లి ఎస్సై స్వామినాయుడు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. యండపల్లికి చెందిన కె.సత్తిబాబు(48) వాకతిప్ప నుంచి ఇంటికి వెళుతుండగా ధాన్యం లోడుతో వెళుతున్న లారీ ప్రమాదావశాత్తు ఢీకొట్టడంతో లారీ కిందపడి తీవ్ర గాయాలయ్యాయి. అతనిని 108లో పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్టు ఎస్సై తెలిపారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

ధ్యానంతో మనసుకు ప్రశాంతత



ధ్యాన మందిరం ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్న దాట్ల ప్రభూజీ

కాకినాడ రూరల్: ధ్యానంతో మనసుకు ప్రశాంతత లభిస్తుందని ధ్యాన శిక్షకుడు దాట్ల ప్రభూజీ పేర్కొన్నారు. విశ్వకాంతి పిరమిడ్ ధ్యాన మందిరం ఆధ్వర్యంలో రమణయ్యపేటలోని అడబాల మినీ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన ధ్యాన శిక్షణ తరగతిలో ఆయన మాట్లాడుతూ ధ్యానంతో మనసుకు పట్టిన మాలిన్యం తొలగుతుందన్నారు. మనసు ప్రశాంతంగా ఉండేందుకు శ్వాసపై ధ్యాస ఉంచాలన్నారు. మనసు, బుద్ధి, చిత్తం, అహంకారం, జ్ఞానం మొదలైన వాటిలో ప్రధాన పాత్ర పోషించేది మనసు దని, మౌనంగా మనసును ధ్యానం వైపు లగ్నం చేయడంతో సర్వ దుఃఖ నివారణ, రోగాల నుంచి విముక్తి కలుగుతుందన్నారు. కార్యక్రమానికి అడబాల స్వర్ణ అధ్యక్షత వహించగా అధిక సంఖ్యలో సాధకులు పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా..!

- ప్రభుత్వ ఆదేశాలతో గ్రామాల బాట పట్టిన వైద్య సిబ్బంది
- ఓఆర్ఎస్ క్యాంపెయిన్లు
- జాగ్రత్తలు పాటించాలంటూ ప్రచారం



గొల్లప్రోలులో ఓఆర్ఎస్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పిఠాపురం: ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు మారుతున్నాయి. ఎండలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. దానికి అనుగుణంగా ఆరోగ్య సమస్యలు వస్తుంటాయి. వాటిని ఎదుర్కొడానికి ప్రజలను అప్రమత్తం చేయడంలో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఏప్రిల్‌లో ఎండలు మండుతున్నాయి రోహిణీ కార్తె ఇంకా రాకుండానే ఎండల తీవ్రత పెరగడంతో ఇక వచ్చేరోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రానున్న వారం రోజుల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఎండలు ఎక్కువగా ఉండడంతో ప్రజలు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉండడంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రభుత్వం ఆరోగ్య శాఖ సిబ్బంది పల్లె బాట పట్టారు. ఉన్నతాధికారులకు ఆదేశాల మేరకు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఎక్కువగా ఎండలో పని చేసే వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తూ వడదెబ్బ తగలకుండా ఎటువంటి ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్న విషయాలను వివరిస్తున్నారు. ముఖ్యంగా వేసవి ప్రతాపంతో జ్వరం, జలుబు, విరోచనాలు, వాంతులు వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడంతో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. వేసవి ప్రతాపంతో డీహైడ్రేషన్‌కు గురయ్యే పరిస్థితుల్లో పనులు చేసే ఉపాధి కూలీలకు ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించి జాగ్రత్తలు తెలియజేస్తున్నారు.

లక్షణాలు ఇవీ

- చెమట పట్టక పోవడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, వణుకు పుట్టడం, మగత నిద్ర, కలవరింతలు, ఫిట్స్, పాక్షికంగా అపస్మారక స్థిలోకి వెళ్లడం

చేయకూడనివి

- తీవ్ర ఉష్ణోగ్రతలు ఉండే సమయంలో ఎక్కువగా బయట తిరగకూడదు.
- రోడ్ల పక్క విక్రయించే చల్లని రంగుల పానీయాలు తాగకూడదు. రోడ్ల పక్క అమ్మే ఆహారం తినకూడదు.
- మాంసాహారం తగ్గించాలి, తాజా కాయకూరలు ఎక్కువగా తీసుకోవాలి. మద్యం సేవించరాదు.

చేయాల్సినవి

- నీళ్లు, పళ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ, ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. నలుపు, మందంగా ఉండే వాటికి బదులు లేత రంగుల్లో లభించే తేలికైన కాటన్ దుస్తులను మాత్రమే వినియోగించాలి. రోజు కనీసం 15 గ్లాసుల నీళ్లు తప్పనిసరిగా తాగాలి. పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఆహారం తక్కువ మోతాదులో ఎక్కువ సార్లు తీసుకోవాలి. ఎండ వేళ ఇంటి పట్టునే ఉండాలి. బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపి వంటివి వాడాలి. ఇంట్లో కటికీలు తెరచి ఉంచుకోవాలి.

వడదెబ్బకు గురైతే ఇలా చేయండి

- ఎవరైనా వడదెబ్బకు గురైతే వెంటనే చల్లని ప్రదేశానికి తరలించాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థితికి వచ్చే వరకు తడి గుడ్డతో శరీర మంతా తుడవాలి. చల్లని గాలి తగిలే ఏర్పాటు చేయాలి. ఉప్పు కలిపిన మజ్జిగ, చిటికెడు ఉప్పు కలిపిన గ్లూకోజ్, ఓరల్ డీహైడ్రేషన్ ద్రావణం(ఓఆర్ఎస్)లు పట్టించాలి. పిల్లలు, గర్భిణులు, వృద్ధులు ఎండాకాలంలో మరింత శ్రద్ధ తీసుకోవాలి. వడదెబ్బ తగిలి అపస్మారకస్థితిలో ఉన్న రోగికి వెంటనే నీరు తాగించకూడదు, వీలైనంత త్వరగా దగ్గరలోని ఆస్పత్రికి తరలించి వెంటనే వైద్య సేవలు అందించేలా చూసుకోవాలి.

ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం

వేసవిలో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా ప్రభుత్వ ఆదేశాలతో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాం. ఇప్పటికే గొల్లప్రోలు మండలంలో పలు గ్రామాల్లో గ్రామ సచివాలయాలు, ఆరోగ్య ఉప కేంద్రాల ద్వారా ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బందితో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఓఆర్ఎస్ క్యాంపెయిన్స్ నిర్వహించడంతో పాటు ప్రతి గ్రామంలోను ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాం. ఆరోగ్య సిబ్బందిని అప్రమత్తం చేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం. ముఖ్యంగా ఎండలో పని చేసే వారిపై నిఘా పెట్టి వారికి ఏ అవసరం వచ్చినా వెంటనే చర్యలు తీసుకునేలా ఏర్పాటు చేశాం.

–అహ్మద్ బాషా,
హెల్త్ సూపర్‌వైజర్, గొల్లప్రోలు

జాతరను విజయవంతం చేయండి



సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ సుబ్రహ్మణ్యం

- అధికారులకు ఆర్డీఓ కార్యాలయ ఏఓ సుబ్రహ్మణ్యం ఆదేశం
- కాండ్రకోట నూకాలమ్మ జాతరపై సమీక్ష

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మండలం కాండ్రకోట నూకాలమ్మ జాతర ఉత్సవాన్ని విజయవంతం చేయాలని పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయ ఏఓ సుబ్రహ్మణ్యం ఆదేశించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ టీవీ సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో ఏఓ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, వైద్య, విద్యుత్ శాఖల అధికారులు సమన్వయంతో జాతర ఉత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. అనంతరం జాతర ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఆలయ చైర్మన్ గవరసాని వీరాస్వామి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

వంగా గీత ఇంటింటా ప్రచారం



చేబ్రోలులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వంగా గీత

గొల్లప్రోలు: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని వైఎస్సార్ పిఠాపురం నియోజకవర్గ అభ్యర్థి వంగా గీత అన్నారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలో సోమవారం రాత్రి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. స్థానిక ప్రజలు ఆమెకు ఘన స్వాగతం పలికారు. మళ్లీ మళ్లీ మాకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కావాలని అక్కడ ప్రజలు గొంతెత్తారు. ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత మాట్లాగుతూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధి సంక్షేమ పథకకాలే మమ్మల్ని గెలిపిస్తాయని ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. మీరు మా ఇంటి ఆడపడచు అని ఏ సమస్య వచ్చినా నిర్భయంగా చెప్పుకునే అవకాశం మీదగ్గరే ఉందని, మాకు మీరే ఎమ్మెల్యేగా కావాలని ముక్త కంఠంతో చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ పార్టి జిల్లా యవజన అధ్యక్షుడు కొప్పన శివనాథ్, జెడ్పీటీసీ వులవకాయల నాగలోవరాజు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అరిగెల రామయ్య దొర, గ్రామ పార్టి అధ్యక్షులు పుప్పాల బాబులు, వైఎస్సార్ సీపీ నాయకులు కడిమిశెట్టి భాస్కర రెడ్డి, కర్రి రాంబాబు, జాగు చంద్రరావు, ఓరుగంటి రవి, గొల్లపల్లి నానజీ, ఓరుగంటి నాగేంద్ర, కర్రి గవరయ్య, అరెగిల మణిబాబు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే జగన్ లక్ష్యం

- ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్
- నియోజకవర్గ దళిత సమ్మేళనం



దళిత సమ్మేళనంలో మాట్లాడుతున్న సునీల్ తదితరులు

సామర్లకోట: రాష్ట్రంలో పేదరికాన్ని శాశ్వతంగా నిర్మూలించాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని వైఎస్సార్ సీపీ కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ అన్నారు. మంగళవారం రాత్రి సామర్లకోట–పెద్దాపురం రోడ్డులోని ప్రైవేటు లే అవుట్‌లో ఏర్పాటు చేసిన నియోజకవర్గ దళిత సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ఆయనే ముఖ్యమంత్రి కావాలని సునీల్ విజ్ఞప్తి చేశారు. సమాజంలో సమానత్వం రావాలంటే ప్రతి ఒక్కరూ ఆర్థికంగా ప్రగతి సాధించాలన్నారు. దీని కోసమే ఎన్ని కష్టాలు వచ్చినా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. దేశంలో పేద ప్రజల కోసం పని చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రిగా గుర్తింపు పొందారని తెలిపారు. దీనిలో భాగంగా రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలు అమలు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. ప్రజల కోసం పని చేస్తానని తెలిసే తనను ఎంపీ అభ్యర్థిగా ఎంపిక చేశారని తెలిపారు. కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోవడానికి పోటీ చేస్తున్నట్టు ఆయన తెలిపారు. అనుభవం, అనుబంధంతో ఒక ప్రణాళిక తయారు చేసి పార్లమెంట్ ప్రాంతాన్ని మోడల్ ఎంపీ ప్రాంతంగా తయారు చేస్తానని తెలిపారు. దీనిలో భాగంగానే 400 గ్రామాలను ఎంపిక చేసి ప్రతి గ్రామాన్ని రూ.కోటితో అభివృద్ధి చేయడం జరుగుతుందని ఆయన హామీ ఇచ్చారు. కాకినాడ పార్లమెంటు పరిధిలో పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. నియోజకవర్గంలో సాంకేతిక శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసి వారికి ఉపాధి కల్పిస్తానని హామీ ఇచ్చారు. పేద ప్రజల కోసం ఫ్యాను గుర్తుపై ఎంపీకి ఒకటి, ఎమ్మెల్యేకు ఒక ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. 40 రోజుల పాటు కష్టపడితే విజయం తథ్యమని ఆయన అన్నారు. వైఎస్సార్ సీపీ అందరి పార్టీ అని గమనించాలన్నారు. పెద్దాపురం ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు మాట్లాడుతూ తన సొంత ఆస్తులతో ప్రజలకు సేవ చేయాలనే రాజకీయాలోనికి వచ్చినట్టు ఆయన తెలిపారు. పెద్దాపురం కొండలు మింగి వేసిన రాజప్పను అమలాపురం పంపాలని దొరబాబు ప్రజలను కోరారు. పెద్దాపురం నియోజకవర్గంలో అనేక పదవులు ఎస్సీ, బీసీలకే ఇచ్చారని, హోమ్ మంత్రిగా ఉన్న రాజప్ప స్థానికులకు ఒక హోమ్‌గార్డు ఉద్యోగం కూడా వేయించలేదన్నారు. అమలాపురానికి చెందిన వారికి మాత్రం ఉద్యోగాలు వేయించారని ఆయన ఆరోపించారు. ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పెదపాటి అమ్మాజీ మాట్లాడుతూ పేదల కోసం పని చేసే నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని అటువంటి వ్యక్తిని గెలిపించుకోవాలన్నారు. ఎవరైనా ఎస్సీలుగా పుట్టాలనుకుంటారా అని ప్రశ్నించిన చంద్రబాబునాయుడుకు ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. పదవుల కోసం మామనే వెన్ను పోటు పొడిచిన చంద్రబాబు ఎంతటికైనా దిగజారతాడని అన్నారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్ అధ్యక్షత వహించగా భారతమాత సేవా పరిషత్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గొరకపూడి చిన్నయ్యదొర, రాష్ట్ర దళిత నాయకుడు నేతల నాని, లింగం శివప్రసాద్, దళిత నాయుకులు బీపెల్లి పండు, పిట్టా సత్యనారాయణ, వారా సుధాకర్, నేతల హరిబాబు, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శులు మడికి సానియా, జానీ మోజెస్, రాష్ట్ర అయ్యరక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, పెద్దాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, అన్నవరం దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యురాలు నేతల వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

సంచార జాతుల వారిని ఆదుకుంటాం



పార్టీలో చేరిన సంచార జాతుల కుటుంబాలతో దవులూరి దొరబాబు



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో దవులూరి దొరబాబు

సామర్లకోట: సంచార జాతుల వారిని అన్ని రకాలుగా ఆదుకుంటామని వైఎస్సార్ సీపీ నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు అన్నారు. స్థానిక ఇస్మాయిల్‌నగర్, పెన్షన్‌లైన్‌కు చెందిన సంచార జాతులకు చెందిన 100 కుటుంబాల వారు ఇస్మాయిల్‌నగర్‌లో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ సంచార జాతుల వారి సమస్యలు పరిష్కరించడంతో పాటు అధికారంలోకి వచ్చిన వెంటనే ఇళ్లు లేని వారికి ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలు పేదలకు పెత్తందారులకు మధ్య జరుగుతున్న యుద్ధం అని పేర్కొన్నారు. పార్టీలోకి వచ్చిన వారికి పార్టీ కండువా వేసి ఆయన ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, పట్టణ పార్టీ అధ్యక్షుడు మద్దాలి శ్రీను, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఉబా జాన్ మోజెస్, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు మన్యం చంద్రరావు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పాగా సురేష్‌కుమార్, పలువురు కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు

వైఎస్సార్ సీపీలోకి చేరికలు జోరుగా సాగుతున్నాయి. దీనిలో భాగంగా మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ క్యాంప్ కార్యాలయంలో మాజీ కౌన్సిలర్ కర్రి కతారితో పలువురు పార్టీలోనికి చేరారు. వారికి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. పాతాబత్తుల సత్యనారాయణ, వీరభద్రరావు, పంతాడ సత్తిబాబు తదితరులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని పిలుపు నిచ్చారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే పేదలకు మేలు జరుగుతుందని చెప్పారు. ఈ మేరకు ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీ విజయం సాధించాలని, జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీ నారాయణ, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దాలి శ్రీను, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు మన్యం చంద్రరావు, కౌన్సిలర్ మర్రి శేషారావు తదితరులు పాల్గొన్నారు.

జి.రాగంపేటలో రూ.3 లక్షలు స్వాధీనం



జి.రాగంపేట వద్ద స్వాధీనం చేసుకున్న నగదుతో ఎన్నికల సిబ్బంది

పెద్దాపురం: మండలంలోని జి.రాగంపేట వద్ద మంగళవారం ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీల్లో రూ.3 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఈఆర్వో జేఎస్ రామారావు తెలిపారు. సామర్లకోట ఎంపీడీఓ దుర్గా శ్యామ్ సుందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామానికి చెందిన బొడ్డు సంతోష్‌కుమార్ వద్ద నుంచి అనధికారికంగా ఉన్న ఈ నగదును స్వాధీనం చేసుకున్నారు. సరైన ఆధారాలు చూపకుంటే ఆ సొమ్మును ట్రజరీకి అందజేస్తామని ఆర్ఓ తెలిపారు.

పిఠాపురంలో ప్రచార సామగ్రి..

పిఠాపురం: ఒక రాజకీయ పార్టీకి చెందిన ప్రచార సామగ్రిని పిఠాపురం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు మంగళవారం రాత్రి పట్టుకున్నారు. ఒక వ్యాన్‌లో తరలిస్తున్న సామగ్రికి సంబంధించి ఎటువంటి రికార్డులు లేక పోవడం అనుమతి పత్రాలు లేకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకున్న అధికారులు పిఠాపురం పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించారు. పూర్తి విచారణ తరువాత కేసు నమోదు చేస్తామని అధికారులు తెలిపారు.

గురుకుల విద్యార్థికి తప్పిన ప్రాణాపాయం

- ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంపై తల్లిదండ్రుల ఆందోళన
- శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్



విద్యార్థి పేర్ల జాన్‌బాబు

కరప: గురుకుల పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యంతోతో ఒక విద్యార్థి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. కరపలో మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలలో ఉప్పాడ కొత్తపల్లి మండలం ఉప్పాడ గ్రామానికి చెందిన పేర్ల జాన్‌బాబు 9వ తరగతి చదువుతున్నాడు. గత నెల 30న పాఠశాల ప్రాంగణంలో ఆడుకుంటూ అనుకోకుండా రెండు అంగుళాల ఇనుప ముక్కను మింగేశాడు. జాన్‌బాబు కడుపులోకి వెళ్లిన ఆ ఇనుప ముక్క క్రమేపీ పెద్ద పేగులోకి వెళ్లి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఇంత జరిగినా పాఠశాల ప్రిన్సిపాల్ ఎవరికీ తెలియకుండా ఆసుపత్రిలో చేర్పించి మంగళవారం శస్త్ర చికిత్స చేయించారు. ప్రస్తుతం ఆ విద్యార్థి కోలుకుంటున్నట్లు తెలిసింది. అయితే ఈ ఘటనపై విద్యార్థి తల్లిదండ్రులు పేర్ల తాతారావు, సత్యవేణి తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఘటన జరిగి నాలుగు రోజులైనా ప్రిన్సిపాల్ తమకు చెప్పకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విచారణ జరిపి వెంటనే సదరు ప్రిన్సిపాల్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

పార్టీ విజయమే లక్ష్యం కావాలి

- సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి
- 27వ డివిజన్ నుంచి చేరికలు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించడమే లక్ష్యం కావాలని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక 27వ డివిజన్ దూదిమిల్లు ప్రాంతానికి చెందిన పలువురు జనసేన, టీడీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు మంగళవారం వైఎస్సార్ సీపీలో చేరారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చేసిన అభివృద్ధికి ఆకర్షితులై మాజీ కార్పొరేటర్ రాజాన సూర్యప్రకాష్, పైలా రామకృష్ణులు, సోమిరెడ్డి చంటి ఆధ్వర్యంలో సుమారు 60 మంది యువకులు, మహిళలు పార్టీలో చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే ద్వారంపూడి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ పేదలకు మంచిచేసిన ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకోవాలని, కొత్తగా పార్టీలో చేరిన వారంతా దీనిపై దృష్టిసారించాలని సూచించారు. మాజీ డిప్యూటీ మేయర్ చోడిపల్లి ప్రసాద్, పలువురు నాయకులు, కార్యకర్తలు ఆయన వెంట ఉన్నారు.

బాలల్లో పఠనాసక్తిని పెంపొందించాలి

గ్రంథాలయ విశ్రాంత అధికారి సుబ్బారావు

కాకినాడ రూరల్: మానవ వికాసానికి, సాంస్కృతిక పురోగతికి పుస్తకాలు దోహదం చేస్తాయని, బాలల్లో పఠనాసక్తిని పెంపొందించాలని గ్రంథాలయ విశ్రాంత అధికారి చింతపల్లి సుబ్బారావు పేర్కొన్నారు. ప్రపంచ బాలల పుస్తక దినోత్సవాన్ని పురస్కరించుకుని సర్పవరం జంక్షన్ బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బాల్య దశలో నీతి నిజాయితీ, మంచి – చెడు, పరులకు సహాయం పడడం వంటి నీతి కథలు చదవడం వల్ల ఆయా కథల్లో సారాంశం, నీతి వారి మదిలో చెరగని ముద్ర వేసి భవిష్యత్తును చక్కగా తీర్చిదిద్దుతాయన్నారు. మానవ మేధస్సును, విజ్ఞానాన్ని పెంచడానికి పుస్తకాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. నిత్య నూతన విజ్ఞానాన్ని అందించేది పుస్తకాలన్నారు. డెన్మార్క్‌కు చెందిన ప్రఖ్యాత బాల సాహిత్య రచయిత హాన్స్ క్రిస్టియన్ అండర్సన్ 1805 ఏప్రిల్ 2న జన్మించడంతో అప్పటి నుంచి ప్రపంచ బాలల పుస్తక దినోత్సవం జరుపుకొంటున్నామన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, రెడ్డం రాజా, చంద్రరావు, పాల్గొన్నారు.